క్లుప్తంగా

కాంగ్రెస్ యాక్షన్ కమిటీ సభ్యుడిగా మదన్‌బాబు

సైదాబాద్: హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ యాక్షన్ కమిటీ సభ్యునిగా సైదాబాద్ డివిజన్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు అమిందాల మదన్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ వలీలుల్లా సమీర్ ఆయనకు నియామకపత్రం అందజేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మలక్‌పేట: అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీలో గురువారం కార్పొరేటర్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. నాయకులు మాణిక్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, చందు, సురేందర్, వెంకట్‌రెడ్డి, దినేష్, సందీప్, పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. సభ్యులుగా జూపల్లి ప్రవీణ్, నమేపల్లి నాగేశ్వర రావు, అర్థ వెంకట్ రెడ్డి, సన్నిధి నవీన్ రెడ్డి, చింతల శ్రీధర్, మూర్గం అనిల్ కుమార్, జోలం రమేష్ యాదవ్, గాలిగారి ప్రవీణ్ కుమార్, అనుగుల బీరయ్య, కోళ్ల లక్ష్మి, గుంటి రవీందర్, అడ్ల రాజు, రసమళ్ల శోభారాణి, తోరుపునూరి అనిల్ కుమార్, అండేకర్ ఇంద్రాజీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమాని ముఖ్య అతిథులుగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుంటి లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ ఎం. శ్రీనివాసరావు, దేవాదాయశాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

క్రికెటర్‌కు సత్కారం



అక్షయ్‌ను సన్మానిస్తున్న స్వర్ణలతారెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని త్రివేణినగర్‌కు చెందిన చీకోటి అక్షయ్ అరోరా కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో బుధవారం ఇతను సత్తా చాటి తన జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. స్టార్లెట్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అక్షయ్ 104 బంతుల్లో 130 పరుగులు సాధించి సఫిల్‌గూడ జట్టుపై విజయం సాధించాడు. దీంతో ఇతడికి సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి గురువారం శాలువా కప్పి సన్మానించారు. సైదాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి లక్ష్మణ్ ఠాకూర్, నందు, చీకోటి వంశీకృష్ణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం

మన్సూరాబాద్: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నిరంతర కృషి, మున్సిపల్ శాఖమంత్రి కేటీఆర్ అండదండలతో ఎల్‌బీనగర్ నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందిందని బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి వెంకట్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై ఆమె ఆధ్వర్యంలో హయత్‌నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ, బాలాజీనగర్ కాలనీలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కవిత, తేజస్వీని, స్వాతిరెడ్డి, మాలతి, పద్మ, రాధిక, పారిజాత, నర్మద, లీల, కల్పజా, సాయికుమారి, ధనలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

1969 ఉద్యమమే తెలంగాణ సాధనకు పునాది

వనస్థలిపురం: ఉద్యమకారుల పోరాటం, ప్రాణత్యాగాల వల్లనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా మా సమస్యల పట్ల తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని 1969 రాష్ట్ర ఉద్యమకారుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో జరిగిన 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు చక్రహరి రామరాజు, ప్రధాన కార్యదర్శి మారం సంతోష్‌రెడ్డి మాట్లాడారు. 1969లో విద్యార్థులుగా ఉండి తెలంగాణ కోసం పోరాటం చేసి విద్య, ఉద్యోగావకాశాలు పోగొట్టుకున్నామన్నారు. 1969 ఉద్యమమే తెలంగాణ రాష్ట్ర సాధనకు పునాది అని, మలిదశ ఉద్యమంలో కూడా తాము పాల్గొన్నామన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. తమను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి గౌరవ ప్రదమైన పింఛన్, ఉచిత వైద్యం, గృహావసతి, బస్‌పాస్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చడానికి ప్రభుత్వానికి 15 రోజుల గడువు ఇస్తున్నామని, పరిష్కరించకపోతే దసరా నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఉపాధ్యక్షులు వనం చంద్రమౌళి, కోశాధికారి యేళ్ల చంద్రారెడ్డి, అమరేందర్‌గౌడ్, కాలప్ప, సూర్యనారాయణ, కొండస్వామి, రాధాకృష్ణ, సత్యనారాయణ, మహ్మద్‌గౌస్, లింగన్న, ప్రతాప్‌రెడ్డి, వెంకటరాజు, సీతారామ్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆరోగ్య రక్ష!

- పెరుగుతున్న సీజనల్ వ్యాధుల బాధితులు
- మొదట్లోనే వ్యాధిని గుర్తించి చికిత్సపొందితే మేలు
- 'సాక్షి'తో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ



వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో బారులు తీరిన అవుట్ పేషెంట్లు



ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ

వనస్థలిపురం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, మొదట్లోనే వ్యాధిని గుర్తిస్తే సరైన చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ అన్నారు. గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

ప్ర: ప్రస్తుతం సీజనల్‌గా వచ్చే రోగాలు ఏమిటి, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా?

జ: మామూలుగా వర్షాకాలంలో మలేరియా, డయేరియా, ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా తదితర రోగాలు వస్తుంటాయి. ఈ సీజనులో విషజ్వరాలు, డెంగీ, ఆర్ఎస్‌వీ (రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్) వ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ కేసులు కూడా పెరుగుతున్నాయి. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు, ఇన్‌పేషంట్లకు కావలసిన బెడ్లు అందుబాటులో ఉన్నాయి.

ప్ర: ఆసుపత్రికి వచ్చే రోగుల తాకిడి ఎలా ఉంది? ఏ రుగ్మతలతో ఎక్కువగా వస్తున్నారు ?

జ: గతంలో పోలిస్తే ఓపీ కేసులు పెరుగుతున్నాయి. వర్షాకాలానికి ముందు రోజుకు 4, 5 వందల ఓపీ కేసులు ఉండగా ప్రస్తుతం రోజుకు 7, 8 వందల మంది వస్తున్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, దగ్గు, జలుబు, విరేచనాలు లక్షణాలతో వస్తున్నారు. వారిలో రోజు 5 నుంచి 10 మంది వరకు డెంగీ పాజిటివ్ వస్తోంది.

ప్ర: వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణాలేమిటి, ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి?

జ: వర్షాకాలంలో నీటి గుంతలు, ఇళ్లల్లో ఉండే కుండీలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ బాటిళ్ల తదితర సామగ్రిలో నిల్వ ఉండే నీటి వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. పగటి పూట కుట్టే దోమలవల్ల డెంగీ వస్తుంది. దోమలు కుట్టకుండా దోమతెరలు, చేతులు, కాళ్లు కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి.

ప్ర: రోగాల బారిన పడినవారికి మీరిచ్చే సలహాలేమిటి?

జ: వ్యాధుల బారిన పడినవారు మొదటి రోజు నుంచే చికిత్స పొందితే సత్వరం కొలుకునే అవకాశం ఉంది. జ్వరపీడితులు పారాసెటమాల్ మాత్ర, ఓఆర్ఎస్ ద్రవం, పళ్ల రసాలు, సరైన విశ్రాంతి తీసుకోవాలి. అనవసరమైన యాంటీ బయోటిక్ మందులు తీసుకోరాదు. సాధ్యమైనంత వరకు నిల్వ పదార్థాలు, బయటి ఫుడ్ తీసుకోవద్దు. కాచి చల్లార్చి వడకట్టిన నీటిని మాత్రమే తాగాలి.

పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే 'డబుల్' ఇళ్లు

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



హత్తిగూడలో డబుల్ ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

మన్సూరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల పక్షపాతి అని, పేదలు ఆత్మగౌరవంతో బతకాలని డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారని రాష్ట్ర గనులు, సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి హత్తిగూడ వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాలను స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయన్నారు. నగరానికి చేరువలో విలువైన ప్రభుత్వ భూముల్లో అతి సుందరమైన డబుల్ ఇళ్లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. కేవలం పదేళ్ల కాలంలోనే తెలంగాణను దేశంలో నెంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. పూర్తి పారదర్శకంగా డబుల్ ఇళ్ల కేటాయింపు జరిగిందని, అర్హులైన పేదలందరికీ దశలవారీగా డబుల్ ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుల స్వప్నాచిరంజీవి, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణస్వామి, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్థానికులకు ఇళ్లు కేటాయించాలని కోరితే అరెస్టులా?: కొప్పుల



కొప్పుల నర్సింహారెడ్డిని అరెస్టు చేస్తున్న హయత్‌నగర్ పోలీసులు

మన్సూరాబాద్: డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అర్హులైన స్థానికులకు కేటాయించాలని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలను కోరేందుకు ప్రారంభోత్సవానికి వెళ్తున్న తనను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి హయత్‌నగర్ స్టేషన్‌కు తరలించడం శోచనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డబుల్ ఇళ్ల సముదాయం వద్ద ఆయన మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ నిధులతో హత్తిగూడలో నిర్మించిన 432 డబుల్ ఇళ్లలో స్థానికులకు కాకుండా.. యాకుత్‌పురా, బార్కాస్, చార్మినార్, మలక్‌పేట ప్రాంతాలకు చెందిన ఒక వర్గం వారికి 332 ఇళ్లను కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలకే ఇళ్లు కేటాయించాలనుకుంటే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ముస్లింలకు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన అర్హులైన స్థానికులకు ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇళ్ల కేటాయింపులో నియోజకవర్గానికి ప్రాధాన్యం లేకపోవడానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క రాజేష్, కడారి యాదగిరి యాదవ్, పాతూరి శ్రీధర్‌గౌడ్, పారంద సాయి, కోటయ్య, ప్రవీణ్‌కుమార్, జయతేజ, సంపత్, రమేష్‌చారి పాల్గొన్నారు.

స్థానికులకే టికెట్ కేటాయించాలి

కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరిన ఎల్బీనగర్ నాయకులు



స్థానికులకే టికెట్ ఇవ్వాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎల్బీనగర్ నాయకులు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా స్థానికులకే అవకాశం ఇవ్వాలని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్‌ఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. అధిష్టానం పిలుపు మేరకు వీరు ఢిల్లీలో ఉన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిని గురువారం కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పని చేస్తున్నామని, పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆగడాలను ఎక్కడికక్కడ ఎండగడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. తమ నలుగురిలో ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరికి కేటాయించినా.. అందరం సమష్టిగా పనిచేసి అభ్యర్థి గెలుపునకు పనిచేస్తామని అధిష్టానానికి తెలిపినట్లు వివరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంతో సంబంధంలేని మధుయాష్కికి ఎల్‌బీనగర్ టికెట్ కేటాయించవద్దని కోరామని చెప్పారు. ఎల్‌బీనగర్ మధుయాష్కికి ఎల్బీనగర్ కార్యకర్తలతో పరిచయాలు లేవని, ఆయనకు టికెట్టు ఇస్తే ఓడిపోవటం ఖాయమని స్పష్టం చేశామని తెలిపారు.

ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యం

సైదాబాద్: కోదాడ పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన సైదాబాద్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సాయిరాం కాలనీలో నివసించే మాధవి కుమారుడు పోతుల రవికిరణ్ ప్రైవేట్ ఉద్యోగి. భార్య అమలతో గొడవల నేపథ్యంలో ఆమె ఫిర్యాదు మేరకు గతంలో సౌత్‌ఈస్ట్ జోన్ మహిళా పీఎస్‌లో కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. ఆ తర్వాత ఇద్దరూ మాదాపూర్‌లో సఖ్యంగానే ఉంటున్నారు. అయితే ఈనెల 19న అతను సైదాబాద్‌లోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చిన రవికిరణ్ భార్య మళ్లీ తనపై కోదాడ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, కోదాడ స్టేషన్‌కు వెళ్తున్నానని బుధవారం ఉదయం 8 గంటలకు తల్లికి చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. మధ్యాహ్నం 12.30కి తల్లి అతనికి ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతోస్నేహితులు, బంధువులను వాకబు చేయగా, ఫలితం లేకపోవడంతో తల్లి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటాడుతున్న ముగ్గురి అరెస్టు

నాగోలు: పేకాటాడుతున్న ముగ్గురిని నాగోలు పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నాగోలు పోలీసుల కథనం ప్రకారం.. గౌరెల్లి గ్రామంలో గురువారం కూర శ్రీనివాస్, ఎరుకల ఈశ్వర్, తోల నందు, ఎండీ బబ్లూ, శివ, శ్రీకాంత్, లింగం గౌడ్ పేకాటాడుతున్నట్టు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈశ్వర్, నందు, బబ్లూలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4600 నగదు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా వారు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రయాణికుడి కాలికి తీవ్రగాయం

నాగోలు: డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో ఒక వ్యక్తి కాలికి తీవ్రగాయమైంది. ఎల్బీనగర్ పోలీసుల కథనం ప్రకారం... కర్మన్‌ఘాట్‌కు చెందిన కొట్టం రాజవర్ధన్‌రెడ్డి వెల్డర్. గురువారం ఉదయం తుర్కయాంజల్‌లో వెల్డింగ్ పనికి వెళ్లేందుకు కర్మన్‌ఘాట్ చౌరస్తాలో బస్సు ఎక్కాడు. సాగర్‌రింగ్ రోడ్డు వద్ద బస్సు ఆగింది. ప్రయాణికులతో బస్సు పూర్తిగా నిండిపోయిందని కిందకు దిగాలని రాజవర్ధన్ రెడ్డిని డ్రైవర్ కోరాడు. దీంతో అతను బస్సు దిగుతుండగా, ట్రాఫిక్ సిగ్నల్ ఆకుపచ్చగా మారడంతో డ్రైవర్ హడావుడిగా బస్సును ముందుకు పోనిచ్చాడు. దీంతో రాజవర్ధన్‌రెడ్డి అదుపుతప్పి రోడ్డుపై పడిపోగా అతడి ఎడమ కాలుపై నుంచి బస్సు టైర్ వెళ్లిపోయింది. కాలుకు తీవ్రగాయం కావడంతో స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం సాయి సంజీవని హాస్పిటల్‌కు తరలించారు. రాజవర్ధన్‌రెడ్డి భార్య ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: సీఐటీయూ



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ ప్రతినిధులు

మన్సూరాబాద్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లపై లాఠీ చార్జీని నిరసిస్తూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన నర్సిరెడ్డి మాట్లాడుతూ, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం జయప్రదం కావడంతో ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి తీవ్ర నిర్బంధానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుకన్యకుమారి, గంగ, సరళ, రేణుక, నీలమణి, రబియా, సత్యమ్మ, మాణిక్యమ్మ నాయకులు ఆలేటి ఎల్లయ్య, వెంకన్న, కనకయ్య, మల్లేశం, గోపి తదితరులు పాల్గొన్నారు.

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై!

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో అంబరాన్ని అంటుతున్నాయి. కాలనీలు, బస్తీల్లోని మండపాల్లో కొలువైన వినాయకుడిని స్థానికులు, ప్రజాప్రతినిధులు దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్నారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై అంటూ నినాదాలు చేస్తూ యువత, చిన్నారులు సందడి చేస్తున్నారు. మండపాల వద్ద ఏర్పాటు చేస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

– ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం



నాగోల్ నుంచి ఓఆర్ఆర్‌కు వెళ్లే దారిలో పసుమాముల వద్ద ఏర్పాటు చేసిన హరిత వినాయకుడు అందరినీ ఆకర్షిస్తున్నాడు. 5 వేల మొక్కలతో ఈ విగ్రహాన్ని రూపొందించినట్టు నిర్వాహకుడు సంజయ్ రెడ్డి తెలిపారు.

- హయత్‌నగర్



అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్, ఏసీపీ శ్యామ్‌సుందర్‌ను సన్మానిస్తున్న మూసారంబాగ్ యువశక్తి ప్రతినిధులు



గడ్డిఅన్నారం డివిజన్ సరస్వతినగర్‌లో...



ఎల్‌బీనగర్‌లోని ఎక్సెల్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో 108 రకాల ప్రసాదాలతో గణనాథుడికి నైవేద్యం



సంజీవయ్యనగర్‌లో.. కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి



నాగోలులోని భాగ్య ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో...

అక్టోబర్ 15 నుంచి భారత భాగ్య సమృద్ధి యజ్ఞం

సైదాబాద్: ప్రజలందరి శ్రేయస్సు కోసం భారత భాగ్య సమృద్ధి యజ్ఞం నిర్వహించనున్నట్టు లతామా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కొంపెల్ల మాధవీలత తెలిపారు. గురువారం సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, ఫౌండేషన్ సభ్యులు, స్థానికులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నగర సంకీర్తన నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలను యాగానికి ఆహ్వానం పలికారు. సీతారాంబాగ్ శ్రీరామ దేవస్థాన ప్రాంగణంలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 27 వరకు ఈ బృహత్తర యజ్ఞం నిర్వహిస్తామన్నారు.

అనాథాశ్రమంలో హీరో కార్తికేయ జన్మదిన వేడుకలు



అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న హీరో కార్తికేయ

హస్తినాపురం: చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటిని సాధించడానికి ఆత్మవిశ్వాసంతో కృషి చేయాలని సినీ హీరో కార్తికేయ గుమ్మకొండ అన్నారు. కార్తికేయ తన జన్మదిన వేడుకలను గురువారం హస్తినాపురంలోని కీర్తన అనాథాశ్రమంలో అనాథ విద్యార్థుల మధ్య కేక్‌కట్ చేసి చిన్నారులతో కలిసి నిరాడంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ, జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా నిరాశకు లోనుకాకుండా తమ లక్ష్యాన్ని సాధించేవరకు కృషి చేయాలన్నారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే జీవితంలో విజయం సాధించగలమని అన్నారు. కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ రజినీ విఠల్‌రెడ్డి, లోహిత్ కార్తికేయ, ఆశ్రమం నిర్వాహకులు అనిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలో కాంగ్రెస్, బీజేపీ పోటీ

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: వారంటీ ముగిసిన కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ స్కీములతో ప్రజలను మోసం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకే తాను ముక్కలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం పార్టీ ముఖ్యనాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కర్ణాటకలో గతంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకుని పని చేసి ఎన్నికల్లో ఓటమిపాలైందని, అదే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు నెలలు తిరగ ముందే 50 శాతం కమీషన్లు తీసుకుని పని చేస్తోందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు స్కాముల పార్టీలుగా అభివర్ణించారు. అవినీతిలో ఈ రెండు పార్టీలు పోటీ పడుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం అభివృద్ధి కోసం ఆరాటపడుతోందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగిస్తున్నందునే తిరిగి మూడోసారి ప్రజలు పట్టం కట్టబోతున్నారని సుధీర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితమే నేడు పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టి ఆమోదించారని అన్నారు. ఈ బిల్లును వచ్చే ఎన్నికల్లోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్ రావు, సాగర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, పద్మానాయక్, చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరావు, గజ్జల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట సమగ్రాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే బలాల



రజక సంఘం కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. రూ. 2.28 కోట్లతో మూసారంబాగ్‌లోని సలీంనగర్ సఫైర్ ఫంక్షన్‌హాల్ వద్ద, సంజీవయ్యనగర్, దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి, మ్యాక్సివిజన్ ఆసుపత్రి వద్ద, శాలివాహననగర్, జేపీహైట్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో సీసీ రోడ్లు, సలీంనగర్ హిల్‌వ్యూవ్ పార్కు, శ్రీపురం కాలనీలోని దోభీఘాట్‌లో కమ్యూనిటీహాల్ నిర్మించారు. వీటిని గురువారం డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ మూసారంబాగ్ అధ్యక్షుడు వై. సత్తయ్య, ప్రధాన కార్యదర్శి మావురం నర్సింం ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అస్లాం, ఎంబిఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్, నాయకులు బి.యాదయ్య, శంకర్, శ్రీరాములు, గోవిందరావు, అశోక్, జకరన్, స్వామి, మోజేష్, పవన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఇలా ఉండగా, పంజేషాహలోని కార్యాలయంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే అహ్మద్ బలాల 18 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.